చుక్కలు రాశి పోసికొని సుందరి మా శశి, మిన్నువీధిలో
ఒక్కతె కూరుచుండి నను నూరక రమ్మని సైగ సేయు, నే
నెక్కడ? తారకా కుసుమ హిండిత తోరణ మాలికా లసత్
పక్కణమైన మి న్నెచట? దాశరథీ! కరుణా పయోనిధీ!

చెత్తను మెత్తగా ఎరువు చేసి యొసంగిన చాలు ప్రీతిమై
ఉత్తమమైన పండ్ల నిడుచుండును వృక్షము, లల్లె ఏవియో
రిత్తలు పల్కగానె బళిరే! యని మా ప్రజ మంత్రిపీఠముల్
దత్తము చేయుచుండెదరు, దాశరథీ! కరుణా పయోనిధీ!

ఆడది లేనిచో బ్రతుకు లన్నియు శూన్యములై నశించునో?
ఆడదె యున్నచో బ్రతుకులందు దవాగ్నులు రెచ్చిపోవునో?
ఆడది లోకనాటకము నాడగజేసెడి సూత్రధారియో?
తాడిత దేవతారిగణ! దాశరథీ! కరుణా పయోనిధీ!

పండిన పండు శాఖ విడివచ్చిన భంగిని పక్వబుద్ధియౌ
పండితు డింక పొత్తముల పత్రపుటమ్ముల నాశ్రయించ, సి
ద్ధండత పాండితీరసము తానె యొసంగు రసజ్ఞరాజ వే
దండకరప్రకాండముల, దాశరథీ! కరుణా పయోనిధీ!

గత మను కాళరాత్రిని సుఖంకర శీతకరప్రభాభిశో
భిత మొనరించి దాన గల వెచ్చని కల్వలు మాల గట్టి భా
రతి మెడలోన వేయవలె, రమ్యపురాకథలన్ సుకావ్య సం
తతి వెలయించగావలెను, దాశరథీ! కరుణా పయోనిధీ!



# వానకురిసే ముందు

'కమల చచ్చిపోతుం దనుకున్నాం వేణూ....' అన్నాడు గోపాలం.

వాకిట్లో కొబ్బరిచెట్టు గాలికి తల వూపుతోంది.

నాలుగేళ్ల తర్వాత చూసిపోదా మని వచ్చిన వేణు, గోపాలం మాటలు శ్రద్ధగా వింటున్నాడు. 'ఆసుపత్రి వాతావరణం, అంతపెద్ద సుస్తి.... అలాగే అనిపిస్తుంది....' అన్నాడు.

గోపాలం బరువుగా లేచి 'నువ్వు ఈ ఇల్లు చూడలేదుగదూ!....' అన్నాడు.

'ఎక్కడోయి....ఇప్పుడేగా ఈ కొత్త ఇంటికి రావటం నేను—'

'చూద్దాంపద—' అంటూ వేణు భుజంమీద చెయ్యివేసి లోపలకు తీసుకుని పోయాడు.

కొబ్బరిచెట్టు ఇంకా తలవూపుతునే వుంది. వేపచెట్టు పండుటాకుల్ని జల జలా రాల్చేస్తున్నది. చెట్టుమీద గోరువంక ఒకటి బిక్కుబిక్కుమంటూ తిరుగుతూ ఒకటే రొద చేస్తోంది.

దొడ్లో అరుగుమీద వున్న పూల కుండి చూపిస్తూ 'ఈ తెల్లగులాబీ లంటే మా ఆవిడకు మహాప్రాణం......' అన్నాడు గోపాలం.

'అందుకనే అన్ని పూలు పూస్తోంది...' అన్నాడు వేణు నవ్వుతూ.

'ఈ అంటు మా ఆవిడ వాళ్ళ పుట్టింటివాళ్ళ దగ్గరనుంచి ప్రత్యేకం తెప్పించిందోయి.....ఎంత శ్రద్ధనుకున్నావు. . ప్రత్యేకంగా దాని ఆలనా పాలనా తనే చూడాలిట. . .దీనికి ఎరువు సరిగ్గా దొరుకుతుందో దొరకదో నని డికగుర్రాన్ని కొనమని కూర్చుందోయి. . . ఎరువుకోసం ఎవరన్నా గుర్రాన్ని కొనుక్కుంటారటోయి వేణూ. . .'అన్నాడు గోపాలం పగలబడి నవ్వుతూ. వేణు కూడా నవ్వాడు.

'సరే. . .అంత ప్రేమగా పెంచుకునే వాళ్లు పూలన్నీ చెట్టుకే వదిలిపెట్టారేం, అన్నాడు.

'భలేవాడివే. . .ఎక్కడుండాల్సిన వస్తువులు అక్కడ వుండనిస్తేనే అందం. . .చెట్టుమీ దయితే ఎన్ని రోజులయినా పువ్వు వాడకుండా వుంటుంది. మనచేతిలోకి వస్తేనా...మరి...గంటలో వాడిపోయి రేకు లన్నిటినీ రాల్చేసు కోదుటోయి. . .' అన్నాడు.

గోపాలం లోపలకు దారి తీస్తూ మొదటగదిలో లైట్లువేసి 'మా పెళ్లి ఫొటో

ఇసుకపల్లి దక్షిణామూర్తి

చూశావా...' అంటూ గోడమీద వున్న ఫొటోలను కుర్చీపీట ఎక్కి తీశాడు. చొక్కాతో దాని దుమ్ము దులిపి 'నువ్వు మా అవిడను చూడలేదు గదూ...' అన్నాడు ఫొటో అందిస్తూ.

'ఓహో...ఈఅమ్మాయా...అదృష్టవంతుడివోయి...' అన్నాడు పటంవంక తేరిపార చూస్తూ.

'మా ఆవిడ ఈ మాట వప్పుకుంటుందనా...ఎప్పుడూ తనే అదృష్టవంతురాలి నని చెప్పుకుంటూ వుంటుంది...నా అంతటివాడు భర్తగా దొరకటం తను చేసుకున్న నోముల ఫలితంట...నావంటి అప్రయోజకుడిని గురించి అట్లా అనుకోవటం పిచ్చి కాదూ...' ఫొటో వంక చూస్తూ గోపాలం మాట్లాడుకుపోతున్నాడు.

వేణు మనస్సులో తన పెళ్లిఫొటో జ్ఞప్తికి వచ్చింది. ఎవరో ఎరగని అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. ఆ అమ్మాయి బాగానే వుంటుంది...కాని తను ఫొటో చూస్తే ఇటువంటి భావాలు రావు. ఏదో చిన్ననాటి సంగతిలా... చదివేసిన పుస్తకంలా కనబడుతుంది. తన భార్యముఖంలో తన కేమీ విశేషం కనపడదు. గోపాలం విషయంలో అట్లా కాదు. భార్యఅంటే ప్రాణం అతనికి. అతని సర్వస్వము. అతనిహృదయంలో ఎన్నో చక్కని భావాలు వస్తుంటాయి.

ఫొటో మళ్లీ గోడమీద మేకుకి తగిలిస్తూ 'మా కమల ముఖం చూస్తే నీ కేమనిపిస్తుంది' అన్నాడు గోపాలం.

'నా కేమనిపిస్తుంది_నువ్వే చెప్పాలి....' అన్నాడు వేణు.

'అట్లా అడుగు చెబుతాను....ఎంత గర్వమో తెలుసా కమలకు....నన్ను పెళ్లి చేసుకుందామనుకుందిట—చేసుకుందిట—నన్ను సాధించిందట – అదీ గర్వం—ఆ ఫొటోలో ముఖం ఎట్లా పెట్టిందో చూశావా—అదంతా విజయ గర్వం కాదూ—'అన్నాడు గోపాలం.

వేణు విని ఊరుకున్నాడు.

'నీకు నమ్మకం కలగటంలేదు కదూ —నేను కమల బొమ్మ గీశాను గదా – ఎప్పుడూ? పెళ్లి కాకమునుపు–ఆ బొమ్మ చూడు—ఈ పెళ్ళినాటి బొమ్మ చూడు– నీకే తెలుస్తుందిలే...' గోపాలం గబగబా పక్కగదిలోకి దారి తీశాడు. వేణు అనుసరించాడు. పెట్టెలోనుంచి బట్టలు బోలెడన్ని తీసి కింద విరజిమ్మాడు గోపాలం. అట్టడుగున వుంది ఆ పటం.

'నా మాట నమ్మలేదుగా చూడు—' అంటూ ఆ బొమ్మతీసిచూపించాడు. వేణు గోపాలం చిత్రకళా నైపుణ్యం చూసి ఆనందపరవశు డయ్యాడు. చాలా అందంగా వుంది ఆ బొమ్మ. కమల రూపురేఖలు అచ్చుదిద్దినట్లున్నాయి. ఆ రేఖల్లో భావనలుగూడా పైకి కొట్టవచ్చినట్లు కనపడుతున్నాయి. అసలు కమలను



"నేను పెళ్లిచేసుకోకపోతే, హుస్సేన్ సాగర్‌లో పడి చచ్చిపోతానన్నావు"
"ఏం జెయ్యమంటావు? ఇప్పుడు చలికాలం. వేసవికాలం రాగానే ఆ పని పూర్తిచేస్తాను"

ఇంతవరకు ఎలావుంటుందో చూడలేదు గాని, వేణు ఈ బొమ్మలో ప్రేమికునికి ప్రేయసి ఎంత అందంగా కనపడుతుందో అర్థం చేసుకున్నాడు. కమల రూపురేఖలు మారలేదు. అవే అందంగా కనబడుతున్నాయి. ఆ చూపుల్లో ఏదో ఆకర్షణ వుంది; గోపాలం చూడగలిగాడు. కాగితంమీద చిత్రీకరించాడు. వేణుకి ఆ చూపు ప్రసాదించాడు.

'నా కర్థమయింది గోపాలం—'

'నీ కర్థం కాలేదు—' అన్నాడు గోపాలం.

వేణు గోపాలం కళ్లల్లోకి చూచాడు. గదిదీపంలో కళ్లు మెరుస్తున్నాయి. కంటిపాపలో దీపం కనబడుతోంది. కనురెప్పలు ఆ దీపం బయటకు పోకుండా కాపలా కాస్తున్నట్లు మధ్య మధ్య మూసుకుంటూ తెరుచుకుంటున్నాయి. కనురెప్పలు కటకటాల్లాగా ఉన్నాయి.

'కమలంటే నీకు ప్రాణం గదూ—' అన్నాడు వేణు.

'ఆ మాట నువ్వనాల్సిందే వేణూ— కమలకు నేనంటే ప్రాణం—నాకు కమల అట్లాగాదు—మే మిద్దరం వేరు వేరు మనుష్యులం—భగవదేచ్ఛవలన ఒకచోట కలిశాం — అంతే —కమల నాకు ప్రాణంతో సమానం కాదు—' అన్నాడు గోపాలం.

వేణు వాదన అనవసరం అనుకున్నాడు. గోపాలం పటం మళ్ళీ లోపల పెట్టేశాడు. బట్టలన్నీ అలాగే చిందరవందరగా పడివున్నాయి. వాటన్నిటినీ

ఒక్కసారిగా పెట్టెలో కుక్కేసి మూత వేశాడు.

'ఇది మా డ్రాయింగ్ రూం వేణూ' అన్నాడు గోపాలం. నేను వేసిన బొమ్మ లంటే మా ఆవిడకు మహా ఇష్టం.... అన్నీ జాగ్రత చేసి ఈ గోడలకు తగిలించింది.'

వేణు గదిగోడ లన్నీ శ్రద్ధగా చూశాడు. ఎన్నో బొమ్మలు అందులో చాలా వాటిల్లో కమల రూపమే ఛాయగా కనపడుతోంది. వాటికి ఒక పక్కగా కమలా, గోపాలం కలిసి తీయించుకున్న ఫోటో వుంది. కమల బాగా మారిపోయింది. దాంట్లో పెళ్లికూతురులాగా లేదు. బాధ్యతగల ఇల్లాలులాగా వుంది. చెవులకు రాళ్ళ దుద్దులు, మెళ్లో చంద్రహారం, , కట్టుకున్నవి పట్టుబట్టల్లాగా కనబడుతున్నాయి.

ఫోటోవంక వేణు చూస్తున్నంతసేపూ గోపాలంగూడా అటుపక్కనే కళ్ళార్పకుండా చూశాడు.

అక్కడనుంచి మెల్లిగా ఇంకొక గదిలోకి వెళ్ళారు.

'ఇది మా పడకగది . . .' అన్నాడు గోపాలం.

'సరే పోదాం పద . . .' అన్నాడు గదిబయటకు వస్తూ.

'అంత తొందరపడితే ఎట్లాగోయి!' అంటూ చెయ్యి పట్టుకుని లోపలకు తీసుకునిపోయి లైట్లువేశాడు. పెద్ద పట్టె మంచం. దోమతెర, పెద్ద బీరువా, నిలువుటద్దం. ప్రకృతి దృశ్యాలు అనేకం. వేణు అవన్నీ చూశాడు.

'మా పడక ఈ గదిలోనే . . . !' అన్నాడు గోపాలం. వేణుకి ఆ వివరాలన్నీ వినటానికి బిడియంగా వుంది. ఏం చెప్పినా 'సరేలే . . . సరేలే. . . !' అంటూ బయటికి దారితీస్తూ వచ్చాడు గోపాలం. ప్రతిదీ నొక్కి నొక్కి చెపుతూ వచ్చాడు.

దొడ్లోకి తీసుకువెళ్లి 'ఇంత పెద్ద తులసి ఎప్పుడన్నా చూశావా' అన్నాడు గోపాలం. వేణు చూశాడు. అయినా తల అడ్డంగా వూపాడు.

'నేను మా స్నేహితుడి ఇంటినుంచి తెచ్చినప్పుడు ఎంత ఉందనుకున్నావు .. సరిగ్గా చిటికెనవ్రేలు పొడుగు లేదోయి వేణూ . . . అంతా కమల పెంచిందే... పెంచటం అంటే నీళ్లు పొయ్యటం అనుకుంటున్నా వేమిటి . . . ఎంత భక్తో తెలుసా . . . ప్రతి శుక్రవారం శ్రద్ధగా పూజ జరగాల్సిందే . . . ఆ పూజ చేసిన తర్వాత ప్రసాదం నేను తింటే కమలకు లాభంటోయి వేణూ . . . ఆ స్వార్థం చూశావా . . .' అన్నాడు గోపాలం.

'దీంట్లో స్వార్థం ఏమిటోయి . . . ప్రసాదం తింటే నీకూ మంచిదేగా' అన్నాడు వేణు.

'అవున్లే నాకు మంచికాకపోవటమేమిటి . . . ఆ ప్రసాదం తిని తిని



ఇట్లా దుక్కలాగా తయారయ్యాను . .' అన్నాడు గోపాలం.

వేణు నవ్వబోయి గోపాలం ముఖం చూసి ఆగిపోయాడు. గోపాలం తను 'దుక్క' లాగా పెరిగానని గర్వంతో ఆ మాటలు చెప్పుకున్నట్లు తోచలేదు వేణుకు. వేణు ఏమీ ఆలోచించలేదు. నవ్వితే గోపాలానికి కోపం వస్తుందేమోనని ఊరుకున్నాడు. అంతే.

అసలే చీకటి. నక్షత్రాల వెలుగు కూడా లేకుండా మబ్బులు కమ్మేసినాయి. దొడ్లోగూడా లైటు వెయ్యాల్సి వచ్చింది.

వంటింట్లోనుంచి వెళ్లారు ఇంకొక గదిలోకి. వంట అయిపోతోంది. గదిలోనుంచి పొగ వస్తోంది. తరిగిన కూరముక్కలు పెద్ద ఆకులో కుప్పగా వున్నాయి.

'నీకేం ఇష్టం—బజ్జీలు చేయించమంటావా—'

'నాకు బజ్జీలు ఇష్టమన్న సంగతి ఇంకా గుర్తుందా గోపాలం నీకు—' అన్నాడు వేణు.

'ఆ—ఆ—గుర్తు లేకేం—' అని 'ఈ పూట ఫస్టుక్లాసు బజ్జీలు కావాలి—' అంటూ కేకవేశాడు వంటంటివైపుకు.

ఇద్దరూ పక్క గదిలోకి వెళ్లారు.

పసిపిల్ల అప్పుడే నిద్ర లేచినట్లుంది. నవ్వుతోంది. పసివాళ్లకు దివ్యదృష్టి వుంటుందిట. దేవతలు కనబడితే



"ఏమోయ్, ఎలా ఉంది వ్యాపారం?"
"మొన్న చాలా కష్టంమీద ఒక్క జత అమ్మాను. నిన్న అదికూడా లేదు. ఈ రోజు మరీ అధ్వాన్నంగా ఉంది."
"అదెట్లాగోయ్?"
"మొన్న అమ్మిన జత ఈ రోజు తిప్పి యిచ్చేశాడు."

నవ్వుతారు. రాక్షసులు కనబడితే ఏడుస్తారు. అది లోకోక్తి. పాప నవ్వుతోంది. కారణం ఏదైనా కావచ్చు. వేణు పలకరించాడు. పాప ఇంకా నవ్వింది. తన ప్రయోజకత్వం అనుకున్నాడు వేణు. గోపాలం పాపను ఎత్తుకుని అటూ ఇటూ తిప్పాడు. ఈల వేశాడు. పాప ఇంకా నవ్వింది.

'ఏమోయి వేణూ. . . పాప నా పోలికా...కమలపోలికా నువ్వుచెప్పు...' అని అడిగాడు గోపాలం.

వేణు సందిగ్ధావస్థలో పడ్డాడు. పాప కమలపోలిక. ఆమాట కమల అడిగితే

నిజం చెప్పటంలో సొంపు ఉండేది. గోపాలం అడగటంతో చిక్కు వచ్చింది.

'నీపోలికే...' అన్నాడు వేణు.

'అబద్ధం...శుద్ధ అబద్ధం చెబుతున్నావు...కావాలంటే కనుక్కుందాం పద...' అంటూ పాపను భుజంమీద ఆడిస్తూ రెండోచేత్తో వేణుని పట్టుకుని జరజరా వంటింటివైపు లాక్కునివెళ్లాడు. వేణుకి ఈ ప్రవర్తన ఏమాత్రం నచ్చలేదు. కమలముందు ఈ పోలికల ప్రస్తావన తీసుకుని రావటం వేణుకి ఇష్టంలేదు. గోపాలం ముఖంలో కోపం స్పష్టంగా కనబడుతోంది. పాపకు తన పోలిక ఉన్నట్లు వేణు తప్పుగా ఊహించాడని కాదు, స్నేహితుడై వుండి ఇంత ముఖ్యమయిన విషయంలో అబద్ధం చెప్పాడే! అని.

'పాప ఎవరి పోలిక...' అంటూ బిగ్గరగా అరిచాడు. వేణు గుండె దిటవు చేసుకుని రాబోయే సంఘటనను ఎదుర్కొనటానికి సిద్ధంగా నిలబడ్డాడు.

వంటింటిలోనుంచి ఒక వితంతు స్త్రీ మెల్లిగా అడుగులు వేసుకుంటూ వచ్చింది. వేణు నిస్తబ్ధుడయ్యాడు.

'పాప కమల పోలికే...' అంది ఆ స్త్రీ.

వేణు శరీరంలో రక్తం పొంగిపోయింది. మనిషి ఎర్రగా కంది పోయాడు. గోపాలం భుజాన్ని పట్టుకుని 'కమల ఎక్కడ...' అంటూ ప్రశ్నించాడు.

గోపాలం సమాధానం చెప్పలేదు. వేణుని కావలించుకుని పసిపిల్లవాడిలాగా హోరు హోరున ఏడవటం మొదలు పెట్టాడు. వాళ్ళిద్దరిమధ్య నలిగి పాప కెవ్వుమని ఏడవసాగింది. వంటమనిషి కన్నీళ్లు తుడుచుకుంటూ వంటగదిలోకి వెళ్ళిపోయింది. బయట కుండపోతగా వాన ప్రారంభమయింది.



# వేమన పద్యాలు



కత్తి వదలి రాజు కామిని చేపట్టె
గంట మొదిలి మంత్రి గరిట పట్టె
వేసమునకు మిగిలె మీసాల దుబ్బులే
విశ్వదాభి రామ వినుర వేమ.

పద్యం : కృష్ణశాస్త్రి చిత్రం : బుజ్జాయి